ప్రజాశక్తి
మంగళవారం 4 ఏప్రిల్ 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

# కొత్త పాలనకు ఏడాది!

- కార్యాలయాల్లో మెరుగుపడని మౌలిక వసతులు
- నర్సరావుపేట, బాపట్లలో పెరగని సౌకర్యాలు
- అధికారులు, ఉద్యోగులకు ఇక్కట్లు



ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పాలన వ్యవస్థను ప్రజలకు చేరువ చేసేందుకు ఏర్పాటు చేసిన నూతన జిల్లాలకు మంగళవారంతో ఏడాది పూర్తవుతుంది. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఏడాది క్రితం తీసుకున్న నిర్ణయం వల్ల జిల్లా స్థాయి అధికారులు మరింత దగ్గరయ్యారు. ప్రధానంగా పల్నాడు ప్రాంత వాసులకు నర్సరావుపేట కేంద్రంగా ఏర్పాటు చేసిన కొత్త జిల్లా ఎంతో కొంత ప్రయోజనకరంగా ఉంది. గతంలో మాచర్ల నుంచి గుంటూరు రావాలంటే నాలుగు గంటల పాటు ప్రయాణించాల్సి ఉండేది. వినుకొండ ప్రాంతాల నుంచి గుంటూరు రావాలన్న మూడు గంటలు పట్టేది. ఇప్పుడు నర్సరావుపేటకు ఎటు నుంచి అయినా రెండు గంటల్లో జిల్లా కేంద్రానికి చేరుకోగలుగుతున్నారు. బాపట్ల వాసులకు గుంటూరు రావడానికి రెండున్నర గంటల సమయం పట్టేది. డెల్టాలోని 12 మండలాల వారు బాపట్ల వెళ్లడానికి గంట, గంటన్నరలోపు జిల్లాకేంద్రానికి చేరుకోగలుగుతున్నారు.

సమయం, దూరం తగ్గడం కొంత ఊరట కలుగుతున్నా నర్సరావుపేట, బాపట్ల పట్టణాలు ఇంకా పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందడం లేదు. మౌలిక వసతులు మెరుగుపడటం లేదు. వర్తక వాణిజ్య కేంద్రాలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందడం లేదు. గుంటూరు వస్తే పాలన పరమైన అంశాలతో పాటు వర్తక, వాణిజ్య, విద్య, వైద్య, వ్యవహారాలు ఒకే రోజు చక్కబెట్టుకునేవారు. ఈ రెండు పట్టణాలలో ఆయా అంశాల్లో ఇప్పటికీ తగిన పురోగతి కన్పించడం లేదు. అలాగే ఉద్యోగులు, అధికారులకు కూడా కార్యాలాయల్లో తగిన వసతులు సమకూరలేదు. చాలా మంది ఇప్పటికీ గుంటూరు నుంచి కొత్త జిల్లా కేంద్రానికి రాకపోకలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు నిధుల కొరత వెంటాడుతుంది. అసౌకర్యాల నడుమ ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులు ఏడాదిలో ఒకటి రెండుసార్లు కూడా నర్సరావుపేట, బాపట్లలో ఆయా జిల్లాల కార్యాలయాలు సందర్శించి ఉద్యోగులు, అధికారులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన పరిస్థితి లేదు.

గుంటూరు జిల్లా నుంచి పల్నాడు, బాపట్ల జిల్లాలు విడిపోయిన తరువాతా కొన్ని శాఖలు గుంటూరులోనే ఉమ్మడి కార్యాలయాలను కొనసాగిస్తున్నాయి. జిల్లా పరిషత్‌తో పాటు వివిధ సంక్షేమ శాఖలు గుంటూరులో కొనసాగడం వల్ల అక్కడి ప్రజలు, ప్రజా ప్రతినిధులు వివిధ అవసరాల నిమిత్తం గుంటూరు రాకతప్పడం లేదు. ఇంజినీరింగ్ శాఖలకు ఇఇ, ఎస్ఇలను నియమించినా గుంటూరు కేంద్రంగా ఉన్న ఎస్ఇనే మొత్తం శాఖపరమైన బాధ్యతలను నిర్వహిస్తున్నారు. కొన్ని శాఖలకు సంబంధించి కీలకమైన సాంకేతిక అంశాలన్నీ గుంటూరు కలెక్టరే చూస్తున్నారు. నియామకాలు, బదిలీలుమొత్తం గుంటూరులోని అధికారులే పర్యవేక్షిస్తున్నారు.

పల్నాడు, బాపట్లలో జిల్లా స్థాయి అధికారులకు సైతం తగిన వసతులు లేక గుంటూరు నుంచే వారు రాకపోకలు కొనసాగిస్తున్నారు. గతంలో ఉమ్మడి జిల్లా కేంద్రాలకు తరచూ వచ్చే రాష్ట్ర ఉన్నతాధికారులు ఇప్పుడు కొత్త జిల్లా కేంద్రాలకు రావడం లేదు. ఆయా శాఖలకు సంబంధించి జిల్లా స్థాయి

▶ 2లో



గుంటూరులో పరీక్షా కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు

# పది పరీక్షలు ప్రారంభం

**మొదటి రోజు గుంటూరు జిల్లాలో 99.30 శాతం, పల్నాడు జిల్లాలో 98.89 శాతం హాజరు - ఒక కేంద్రంలో ప్రశ్నాపత్రం 10 నిముషాల ఆలస్యం**

ప్రజాశక్తి-గుంటూరు

పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. గుంటూరు జిల్లా వ్యాప్తంగా 138 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 26,640 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 26,455 మంది (99.30శాతం) హాజరయ్యారు. 185 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పల్నాడు జిల్లాలో 126 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 24,794 మంది హాజరవ్వాల్సి ఉండగా 24,501 (98.89 శాతం) మంది హాజరయ్యారు. 293 మంది గైర్హాజరయ్యారు. చిన్నిచిన్న అపసృతులు మినహా మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది కలగలేదని అధికారులు తెలిపారు. గుంటూరు నగరం లక్ష్మీపురంలోని ఒక కార్పొరేట్ పాఠశాలకు చెందిన పరీక్షా కేంద్రంలో 10 నిముషాలు ఆలస్యంగా ప్రశ్నాపత్రం ఇచ్చారు. విద్యార్థులు ప్రశ్నించటంతో ఐదు నిముషాలు అదనపు సమయం కేటాయించినట్లు తెలిసింది. స్థానిక ఆగ్జీలియం పాఠశాల పరీక్షా కేంద్రంలో విద్యార్థుల పరీక్ష హాల్స్‌ను తెలియజేసే హాల్‌టిక్కెట్లు నంబర్లు కలిగిన బోర్డును చిన్నది ఏర్పాటు చేయటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు కొంత అసౌకర్యానికి గురయ్యారు. పరీక్ష మొదటి రోజు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున పరీక్షా కేంద్రానికి తరలి రావటంతో పాఠశాలల వద్ద కోలాహలం నెలకొంది. కొన్ని రద్దీ రోడ్లలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. నగరంలోని కెనడీ, లూర్దు హైస్కూల్, జలగం రామారావు మున్సిపల్ హైస్కూల్, జోసఫ్స్ హైస్కూల్, సెయింట్ ఇగ్నీషియస్, పలు పాఠశాలలను గుంటూరు జిల్లా

▶ 2లో



ట్రయల్ రన్‌ను ప్రారంభిస్తున్న నగర కమిషనర్

## చెత్త సేకరణకు ఈ-ఆటోలు

ప్రజాశక్తి-గుంటూరు

త్వరలో గుంటూరు నగరంలో ఇంటింటి నుండి వ్యర్థాల సేకరణకు ఈ-ఆటోలు అందుబాటులోకి రానున్నాయని, ఆటోల నిర్వహణకు కార్మికులకు తగిన శిక్షణిస్తున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం ఇన్నర్ రింగురోడ్డులో ఈ-ఆటోల శిక్షణ పూర్తి చేసుకున్న కార్మికులు చేపట్టిన ట్రయల్‌రన్‌ను కమిషనర్ ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్లాప్‌లో భాగంగా గుంటూరు నగరానికి 220 ఈ-ఆటోలను అందించిందని తెలిపారు. శిక్షణలో ఆటో నడపడంతో పాటు ఛార్జింగ్ పెట్టడం, సాదారణ నిర్వహణ అంశాలపైనా అవగాహన కలిగించాలని తెలిపారు. ఈ-ఆటోలు అందుబాటులోకి వస్తే నగరంలో సమగ్రంగా పారిశుధ్య పనులు నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఇ భాస్కర్, ఎంహెచ్ఒ డాక్టర్ భానుప్రకాష్, ఇఇ కొండారెడ్డి పాల్గొన్నారు.

## పల్నాడు కలెక్టరేట్‌కు ఐఎస్ఒ గుర్తింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



సిఎం నుండి ఐఎస్ఒ ధ్రుపత్రాన్ని అందుకుంటున్న పల్నాడు కలెక్టర్

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో పల్నాడు జిల్లాకు ప్రతిష్టాత్మక ఐఎస్ఒ 9001:2015 గుర్తింపు లభించింది. పల్నాడు జిల్లా తొలి కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆధ్వర్యంలో చేపట్టిన పాలనపరమైన అంశాలపై జిల్లాకు ఈ గుర్తింపు లభించింది. మూడ్రోజులుగా ఐఎస్ఒ సంస్థకు సంబంధించి కార్తికేయ అండ్ టీం కలెక్టరేట్లో పర్యటించారు. పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బంది నిర్వహిస్తున్న రిజిస్టర్లు, జాబ్‌చార్ట్, హోదాల వారీగా ఉద్యోగుల వివరాలు,

▶ 2లో



**రంజాన్ వేళలు**

ఇఫ్తార్ (మంగళవారం సాయంత్రం) : 6.26

సహరీ (బుధవారం ఉదయం) : 4.43




వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న మళయాళి దర్శకులు షాజీ ఎన్.కరుణన్

## భవిష్యత్‌లో అగ్రస్థానంలోకి తెలుగు సినీ రంగం

- తెలుగులో సినిమా తీయాలని ఉంది
- మాళయాల చిత్ర దర్శకులు షాజీ ఎన్.కరుణన్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

భవిష్యత్‌లో తెగులు సినిమా రంగం అగ్రస్థానంలోకి వస్తుందని, తానూ తెలుగులో సినిమా తీయాలని ఉందని ప్రముఖ మళయాళ చిత్ర దర్శకులు షాజీ ఎన్.కరుణన్ అన్నారు. 'సినిమా - సామాజిక చిత్రాలపై సమాలోచన'అంశంపై ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో మూడ్రోజులపాటు నిర్వహించిన జాతీయ స్థాయి

▶ 2లో

## కొత్త పాలనకు ఏడాది!

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయాల్లో మౌలిక వసతులపై ఇంత వరకు ఉన్నతాధికారులు దృష్టి పెట్టడం లేదనే విమర్శలు ప్రభలంగా వినిపిస్తున్నాయి. నర్సరావుపేట, బాపట్ల పట్టణాలలో మౌలిక వసతులు, జిల్లా కేంద్రంగా చేయాల్సిన అభివృద్ధి పనులు, ఉద్యోగులు, అధికారులు స్థానికంగా ఉండేందుకు వీలుగా అనువైన గృహ వసతి, మౌలిక సదుపాయాల కల్పన, విద్యా, వైద్య సౌకర్యాల కల్పనపై ఇంకా ఆయా శాఖల ఉన్నతాధికారులు దృష్టి సారించడం లేదని ఉద్యోగ వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

**ఊపందుకున్న వ్యాపారాలు**

నర్సరావుపేటలో స్థానిక వ్యాపార లావాదేవీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంది. జిల్లా కేంద్రమైన తరువాత నర్సరావుపేటకు రాకపోకలు పెరిగాయి. పెరిగిన రాకపోకలతో భారీ వాణిజ్య సముదాయాలు, మాల్స్ ఏర్పాటుకు కొంతమంది కార్పొరేట్ సంస్థల వారు నర్సరావుపేట పట్టణంలో సర్వేలు చేయిస్తున్నారు.

## పల్నాడు కలెక్టరేట్‌కు ఐఎస్ఒ గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

ఎమర్జెన్సీ కాంటాక్ట్ నంబరు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, కంప్లైంట్ బాక్స్, అత్యవసర అగ్నిమాపక పరికరాలు, పబ్లిక్ టాయిలెట్స్, స్పందన కార్యక్రమం నిర్వహణ, దానిపై ప్రతిస్పందన, పార్కింగ్ ప్లేస్, సీసీటీవీ మానిటరింగ్, వేస్ట్ మేనేజ్మెంట్, కంప్యూటర్ల నిర్వహణ, రిస్క్ అసెస్మెంట్ అనాలసిస్, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ ఆఫ్ ఆల్ డిపార్ట్మెంట్స్, అదేవిధంగా అన్ని శాఖలు డాక్యుమెంట్లు, ఇంటర్నల్ రివ్యూ మీటింగ్ రివార్డ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పరిశీలన అనంతరం కార్తికేయ బృందం కలెక్టర్‌ను కలిసి అభినందించారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఐఎస్ఒ ధ్రువపత్రాన్ని కలెక్టర్ శివశంకర్‌కు సోమవారం అందచేశారు.



ప్రమాదానికి గురైన కార్మికురాలు , కాలికి తగిలిన గాయాలు

## రోడ్డు ప్రమాదంలో పారిశుధ్య కార్మికురాలికి గాయాలు

**ప్రజాశక్తి - మాచర్ల:** పట్టణంలో ప్రధాన రహదారిపై సోమవారం తెల్లవారుజామున పారిశుధ్య విధులు నిర్వహిస్తున్న కార్మికురాలిని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. మాచర్ల పురపాలక సంఘంలో కాంట్రాక్టు విభాగంలో పారిశుధ్య కార్మికురాలుగా పనిచేస్తున్న యు.కళావతి సోమవారం తెల్లవారుజామున రోజు వారి విధుల్లో భాగంగా స్థానిక రింగ్ రోడ్డు సెంటర్లో ప్రధాన రహదారిని ఊడుస్తుండగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికులు ఆటోలో ఆమెను ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రధమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నరసరావుపేటలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కుట్టు మిషన్ శిక్షణా తరగతులు

**ప్రజాశక్తి- దుగ్గిరాల**

మహిళలకు జీవనోపాధి కల్పించేందుకు కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో దుగ్గిరాలలో ప్రారంభించనున్నారు. స్త్రీ శక్తి పేరుతో 70 మంది మహిళలకు ఏప్రిల్ 10వ తేదీ నుండి ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కుట్టు మిషన్ శిక్షణకు దరఖాస్తు చేసుకునేవారు వెంటనే మండల కేంద్రం దుగ్గిరాలలోని టిడిపి కార్యాలయంలోగాని, మంగళగిరిలోని నియోజకవర్గ కార్యాలయంలోగాని మండల పరిధిలోని గ్రామాల మహిళలు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా నిర్వాహకులు కోరారు. ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదని ఉచితంగా శిక్షణ కార్యక్రమం ఉంటుందని వారు తెలిపారు.

# 'పది' పరీక్షలు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

విద్యాశాఖ అధికారి పి.శైలజ సందర్శించారు.

**జిల్లా కలెక్టర్ పరిశీలన**

స్థానిక కొత్తపేటలోని జలగం రామారావు మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి పరీక్ష కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పరీక్షలు జరుగుతున్న తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పరీక్షలు సజావుగా కొనసాగేలా విద్యాశాఖ అధికారులు పటిష్ట చర్యలు ప్రణాళిక ప్రకారం తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట ఎంఇఒ ఖుద్దూస్, హెచ్ఎం సుధారాణి ఉన్నారు.

**పరీక్షల నిర్వహణపై కలెక్టర్ పరిశీలన**


**ప్రజాశక్తి - నరసరావుపేట**

పరీక్షలు రాసే విద్యార్థులకు అసౌకర్యమేమీ కలగకుండా సదుపాయాలు కల్పించాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. పదో తరగగి పరీక్షలు సోమవారం ప్రారంభమైన నేపథ్యంలో పలు పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్, జెసి శ్యామ్‌ప్రసాద్ తనిఖీ చేశారు. నరసరావుపేట పట్టణ పరిధిలోని మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల, లింగంగుంట్ల అగ్రహారం, శంకర భారతిపురం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. గదుల్లో ఏర్పాటు చేసిన వసతులు, బల్లలు, విద్యుత్తు, తాగినీరు, ఉచిత వైద్య సేవా కేంద్రాలను పరిశీలించారు. పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్పి**

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమైన నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పి ఆరిఫ్ హాఫీజ్ పరిశీలించారు. గుంటూరులోని ఉర్దూ హైస్కూల్, హిందూ హైస్కూల్, మాజేటి గురవయ్య హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాలను సందర్శించి, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు, అవకతవకలు తావులేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టామని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నామని చెప్పారు. పరీక్షా కేంద్రాల దగ్గరలో జిరాక్స్, ప్రింటింగ్ సెంటర్లు మూసివేశామన్నారు. పరిశీలనలో సిఐలు శ్రీనివాసరెడ్డి, సుబ్బారావు, నరసింహారావు, శ్రీరామనాయక్ పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రంలో తనిఖీ చేస్తున్న గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



పరీక్షా కేంద్రంలో తనిఖీ చేస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్



పరీక్షా కేందాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పి ఆరిఫ్ హాఫీజ్

# భవిష్యత్‌లో అగ్రస్థానంలోకి తెలుగు సినీ రంగం

(మొదటి పేజీ తరువాయి)

వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి, నాగరికతను మానవతా దృక్పథ మేళవింపుతో చలనచిత్రాల ద్వారా ప్రపంచం నలుమూలలకు వ్యాప్తి చేయాలన్నారు. వచ్చే పదేళ్లలో తెలుగు సినిమా అంతర్జాతీయ స్థాయికి మరింతగా ఎదిగి భారతదేశ చలనచిత్ర రంగానికి దిక్సూచిగా మారుతుందని చెప్పారు. తాను 1971లో తన 22 ఏట సినిమా రంగంలోకి వచ్చానని, ఇప్పటికీ కొనసాగుతున్నానని చెప్పారు. ఈ కాలంలో ఎన్నో మార్పులు వచ్చాయని, కాలానుగుణంగా చిత్ర నిర్మాణం, శైలిలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయని వివరించారు. ప్రతి వ్యక్తికీ తన జీవితంలో అనేక సంఘటనలు గుర్తుంటాయని, వాటిల్లో సినిమా తప్పకుండా ఉంటుందని అన్నారు. సినిమా వాళ్లకు సమాజం పట్ల బాధ్యత ఉండాలని, లౌకికతత్వం, అభ్యుదయ అంశాలను సినిమాల ద్వారా విస్తృతంగా వ్యాప్తి చేయాలని కోరారు. ఒక ప్రాంతానికి చెందిన వారు తీసిన సినిమా ఇతర ప్రాంతాల్లోనూ ఆదరణకు నోచుకుంటున్నాయని, వీటికి ప్రాధాన్యమూ పెరిగిందని విశ్లేషించారు. తాత్వికత, సంస్కృతి అంశాలను సినిమాలుగా తీస్తే ఆదరణ ఉంటుందని చెప్పారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న సినిమా రంగంలో సామాజిక విలువలకు పెద్దపీట వేయాలన్నారు. ఆర్కిటెక్చర్, తెలుగు, ఇంగ్లీష్ విభాగాల విద్యార్థులు సైతం సామాజికాంశాలు, సాహిత్యంపైన దృష్టి సారించాలన్నారు. రానున్న రోజుల్లో వర్సిటీలో సామాజిక అంశాలపై చలనచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం సదస్సుకు హాజరైన వారికి ధ్రువపత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ వరప్రసాదమూర్తి, సినీ విమర్శకులు రెంటాల జయదేవ్, జర్నలిజం విభాగాధిపతి ప్రొఫెసర్ అనిత, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ స్వరూపరాణి, డైరెక్టర్లు పి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఉమామహేశ్వరరావు, ఆర్.వి.రమణి (ఫిల్మ్ మేకర్ చెన్నై), వర్క్‌షాప్ డైరెక్టర్ డాక్టర్ జె.మధుబాబు పాల్గొన్నారు.

## ఫుడ్ సైన్స్ విభాగంలో జాతీయ సదస్సు

**ప్రజాశక్తి- ఎఎన్‌యు**

అచార్య నాగార్జున యునివర్సిటీలోని ఫుడ్ సైన్స్, న్యూట్రీషన్ డైటిటిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఆహార పోషకాల లభ్యత - కోవిడ్19 ప్రభావం అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు సోమవారం ఆచార్య బాలమోహన్ దాస్ సెమినార్ హాల్లో ప్రాంంబమైంది. ప్రారంభ కార్యక్రమానికి సదస్సు డైరెక్టర్, విభాగాధిపతి డా. కె.వి.శాంతిశ్రీ అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ సదస్సు నిర్వహణకు కారణాలు, ప్రాధాన్యతలు వివరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసి ప్రొఫెసర్ పట్టేటి రాజశేఖర్ రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో డిఎన్‌ఎ పాత్రపై మాట్లాడారు. ఆహారపు అలవాట్లపై, రోగనిరోదక శక్తి పెంపుపై చిన్నతనం నుంచే అవగాహన పెంచుకునేలా తల్లిదండ్రులు వారి పిల్లలకు తెలియజయాలన్నారు. కమ్యూనిటీ సైన్స్ కళాశాలకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డా. లక్ష్మీ మాట్లాడుతూ ఫుడ్ అండ్ న్యూట్రీషన్ సెక్యూరిటీని అధిగమించడానికి ఎటువంటి ప్రణాళికలు చేపట్టాలని అనే విషయాలను విశదీకరించారు. అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఆచార్య రాజమణి అగ్రికల్చర్ ఉత్పాదకత పెంపుతో ఆహార భద్రతను ఎలా అధిగమించవచ్చో తెలియజేశారు. కార్యక్రమంలో ఆచార్య సాంబమూర్తి, సదస్సు నిర్వాహక కార్యదర్శి డా. బి. బబిత, ఎస్వీయు నుంచి శాస్త్రవేత్త డా. ఎం.దీప, బాపట్ల అగ్రికల్చర్ అధికారి ఇ.సుహాసిని, డా. బ్రహ్మాజీరావు, డా.సునీత, డా.రాధిక, డా.మంజుల, డా. సాధిక్, డా.సుధీర్, డా.కృష్ణసత్య తదితరులు పాల్గొన్నారు.

# నాయీబ్రాహ్మణులపై అక్రమ కేసులు తొలగించండి

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

మేడికొండూరు మండలం పేరేచర్ల గ్రామంలో నాయీబ్రాహ్మణ కుటుంబం పై అక్రంగా కేసు బనాయించారని అసలైన ముద్దాయిలైన దుడికి వీరాంజనేయులు, ఆదినారాయణ వారి కుటుంబ సభ్యులను పరిగణలోకి తీసుకోకుండా దాడికి గురైన బాధితులపై అక్రమ కేసు బనాయించడంఅత్యంత దుర్మార్గమని నాయి బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు పేర్కొన్నారు. నాయీబ్రాహ్మణ జేఏసీ బీసీ దళిత బహుజన ప్రజా సంఘాలు నిజనిర్దరణ కమిటీగా ఏర్పడి సంఘటనా స్థలాన్ని సందర్శించి నివేదిక రూపొందించిందన్నారు. సోమవారం నిజ నిర్ధారణ కమిటీ నివేదికను కలెక్టర్ ఎస్పీ గ్రీవెన్స్‌లో ప్రతినిధి వర్గం స్వయంగా అధికారులను కలిసి పెట్టిన అక్రమ కేసును పూర్తిగా ఎత్తివేయాలని కోరారు. జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి స్పందిస్తూ చదువుకునే పిల్లలపై ఈ కేసు పెట్టటాన్ని మేము పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పోలీస్ అధికారులను కలవమని సూచించారు. జిల్లా ఎస్పీని నాయీ బ్రాహ్మణ జేఏసీ బీసీ భవ్య ,దళిత ప్రజా సంఘాలు కలిసి నిజనిర్ధారణ నివేదికతో సమర్పించారు. ఎస్పి ఆఫీజ్ స్పందిస్తూ ఈ కేసులో పూర్తి న్యాయం చేస్తామని చెప్పి హామీ ఇచ్చారు. వెంటనే మేడికొండూరు సిఐ వాసుకి ఫోన్ చేసి ఈ నివేదికను మీరు పరిశీలన చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయమని చెప్పి ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు, దళిత ఉద్యమ వేదిక అధ్యక్షులు గంటా ప్రభుదాస్, ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎస్ కే ఖాజావలి, కులనిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బండి కోళ్ల విజయభాస్కరరావు, బిఎస్‌పి నాయకులు చిరతనగంట్ల వాసు, బిసి బహుజన ఫ్రంట్ నాయకులు లింగాల వెంకట సాయిలు పాల్గొన్నారు.

## సాయి స్పందనకు ఇటాలియన్ ఫెలోషిప్ మంజూరు

**ప్రజాశక్తి-ఏఎన్‌యు**

వర్సిటీ పూర్వ విద్యార్థిని ఎ.సాయి స్పందన తన పరిశోధనను కొనసాగించడానికి ఇటాలియన్ ప్రభుత్వ పరిశోధన ఫెలోషిప్ మంజూరు చేసినట్లు పూర్వ విద్యార్థుల సంఘం డైరెక్టర్ జివిఎస్‌ఆర్ ఆంజనేయులు తెలిపారు. 2018-20లో యూనివర్శిటీ స్టాటిస్టిక్స్ విభాగంలో తన పీజీ ప్రోగ్రామ్‌ను అభ్యసించిందని చెప్పారు. వర్సిటీలో ఉన్నప్పుడు వివిధ అకడమిక్, కరిక్యులర్ యాక్టివిటీస్‌లో చురుకుగా పాల్గొనేదని, తరువాత ఆమె మిలన్ విశ్వవిద్యాలయంలో మరొక మాస్టర్స్ ప్రోగ్రామ్‌ను పూర్తి చేసిందన్నారు. పోటీ ఉన్నప్పటికీ ఆమె రీసెర్చ్ ఫెలోషిప్‌కు ఎంపికైనట్లు మిలన్ విశ్వవిద్యాలయం తెలిపిందని చెప్పారు. ఈ సందర్భంగా వర్సిటీ విసి పి. రాజశేఖర్, రెక్టార్ వర ప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ బి. కరుణ, పూర్వ విద్యార్థుల సంఘం డైరెక్టర్ జివిఎస్‌ఆర్ ఆంజనేయులు గణాంక విభాగం అధిపతి బి.సత్యనారాయణ అధ్యాపకులు రాజశేఖరం, రామ్ కిరణ్ , డాక్టర్ సయ్యద్ జిలానీలు అభినందించారు.

## వైఎస్‌ఆర్ డిజిటల్ గ్రంథాలయంపై అవగాహన సదస్సు

**ప్రజాశక్తి -ఎఎన్‌యు**

వైఎస్‌ఆర్ డిజిటల్ గ్రంథాలయంపై ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, స్కిల్ డెవలప్మెంట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ చల్లా మధుసూదన్ రెడ్డి, నవరత్నాల చైర్మన్ వైస్ చైర్మన్ నారాయణమూర్తి, విశ్వవిద్యాలయ వర్సిటీ విసి పి రాజశేఖర్‌లు పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో గత 12 ఏళ్లుగా భర్తీకి నోచుకోని పౌర, విద్యా విషయక గ్రంథాలయ పోస్టులను ముఖ్యంగా జూనియర్ కాలేజి, డిగ్రీ కాలేజి, పాలిటెక్నిక్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న లైబ్రేరియన్ పోస్టులను భర్తీ చేయాలని విన్నవించారు. లైబ్రరీ సైన్స్ విద్యనభ్యసించిన 2 లక్షల మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారని జగనన్న ఇచ్చిన మాట ప్రకారం నోటిఫికేషన్లు ఇచ్చి ఆదుకోవాలని నిరుద్యోగుల తరుపున విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ లైబ్రరీ సైన్సు నిరుద్యోగ జెఏసి రాష్ట్ర అధ్యక్షుడు రమనప్ప, కార్యదర్శి మహేంద్ర, ఉపాధ్యక్షుడు రమేష్ బాబు, సంయుక్త కార్యదర్శి మేకా రమేష్, కోశాధికారి జగదీష్ మరియు జగం, సీతా రామ్, వినయ్ పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న అప్పిరెడ్డి, ఈచంపాటి తదితరులు

# పార్కుల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలకు ఆహ్లాదం పంచి ఆరోగ్యం పెంచే పార్కుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు నగర మేయర్ కావటి శివనాగమనోహర నాయుడు, శాసనమండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి వెల్లడించారు. గుంటూరులోని అన్ని పార్కులను ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. గుంటూరు నగరపాలకసంస్థ పరిధిలోని 32వ డివిజన్ బ్రాడీపేటలోని ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు పార్కులో పలు అభివృద్ధి పనులకు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్యే మద్దాళి గిరి, స్థానిక కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి)తో కలిసి ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి శంకుస్థాపన చేశారు. నేటి ఉరుకులు, పరుగుల పోటీ ప్రపంచ జీవనంలో సంపూర్ణ ఉపశమనానికి ఉద్యానవనాలే సరైన మందు అని లేళ్ళ అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరూ శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ నగరంలోని పార్కులలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా గ్రీనరి, పిల్లల ఆట వస్తువులు, ఇతర మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు తెలిపారు. నగరంలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను శరవేగంగా చేపడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఆర్టీసి కాలనీ, పొన్నూరు రోడ్డు, ఎన్‌జిఒ కాలనీలో పార్కులను అభివద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. అంతేకాక మార్కెట్ సెంటర్‌లోని గాంధీ పార్కును కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామని, త్వరలో గాంధీ పార్కును కూడా ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గాన్ని నందనవనంలా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ప్రకటించారు. అందుకు అనుగుణంగా పార్కుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు చెప్పారు. ఈ క్రమంలోనే తమ నియోజకవర్గంలోని పార్కులన్నీ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు ఆయన వివరించారు. అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, గీతామందిరం ఛైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, వలివేటి వెంకటరమణ, ఐతి సతీష్, గులేచా, మేరిగ విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రసాద్, ఈఈ సుందరరామిరెడ్డి, డీఈ రఫీక్ పాల్గొన్నారు.

## శ్మశానాల్లో మౌలిక సదుపాయాలు..

నగరంలోని స్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, పచ్చదనం పెంపుదల, అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు తెలిపారు. సోమవారం నగరంలోని శ్రీనివాసరావుతోటలోని హిందూ స్మశాన వాటికలో నిర్వహిస్తున్న వివిధ అభివృద్ధి పనులను తనిఖీ చేసి తీసుకోవాల్సిన చర్యలపై ఇంజినీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. మేయర్ మాట్లాడుతూ శ్రీనివాసరావుతోట స్మశాన వాటికను 8 డివిజన్లలోని సుమారు లక్ష మంది ప్రజలు వినియోగిస్తున్నారన్నారు. ఇక్కడ గ్రీనరీ, సంప్రదాయం ప్రకారం నిర్వహించే పెదకర్మ, కొన్ని రోజుల పాటు అక్కడే ఉండేందుకు గదులు, భోజనశాల, వంటశాల, కేశకండనం, సాన్నపు గదులు, అస్థికలు భద్రపరిచే గదులు, స్మశాన వాటిక బయట రోడ్డు విస్తరణ, తదితర పనులు చేపట్టినట్లు చెప్పారు. మేయర్ వెంట కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, గేదెల నాగరంగమణి రమేష్, కాంద్రుకుంట గురవయ్య, తేలుకుట్ల హనుమాయమ్మ యోగేశ్వర రావు, సాదు ఉమామహేశ్వరి రాజేష్, ఈఈ సుందర రామిరెడ్డి తదితరులున్నారు.




## సంక్షేమ బోర్డును పటిష్టంగా అమలు చేయండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

భవన నిర్మాణ కార్మికులు అనేక సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును పటిష్టంగా అమలు చేయాలని పల్నాడు భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం(సిఐటియు) పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అవ్వారు ప్రసాద్ రావు, షేక్షాక్షలార్ మసూద్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 5న ఢిల్లీలో తలపెట్టిని చలో ఢిల్లీ కార్యక్రమానికి పల్నాడు జిల్లా భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ సెంటర్లోని సంఘ కార్యాలయం నుండి తాలూకా సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. షేక్ సిలార్ మసూద్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల కాలంలో కరోనా లాక్ డౌన్,ఇసుక కొరత,మెటీరియల్ ధరలు పెరుగుదల వంటి కారణాలతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. కుటుంబాలు గడవక ఆకలి చావులను కూడా చవిచూశారని అన్నారు. అయినప్పటికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల పట్ల ఏమాత్రం కనికరం చూపించలేదని అన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 5న ఢిల్లీలో జరిగే కార్మిక కర్షక మార్చ్ లో పాల్గొని తమ నిరసనను తెలియజేస్తామని తెలిపారు. సిఐటియు నాయకులు రొంపిచర్ల పురుషోత్తం, బత్తుల కొండలు, చిమట యేసు, తోట ఆంజనేయులు,కొత్తపల్లి సాంబశివరావు, మహేష్, అంగలకుదురు ఆంజనేయులు, కొమ్ముల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## విధి నిర్వహణలో బాధ్యతగా మెలగాలి

**ఎస్‌పిఎఫ్ అడిషనల్ కమాండెంట్ బ్రహ్మాచారి**

ప్రజాశక్తి-విజయపురిసౌత్

విధి నిర్వహణలో ఎస్‌పిఎఫ్ సిబ్బంది బాధ్యతగా మెలగాలని ఎస్‌పిఎఫ్ అడిషనల్ కమాండెంట్ బ్రహ్మాచారి అన్నారు. నూతనంగా అడిషనల్ కమాండెంట్‌గా బాధ్యతలు చేప ట్టిన ఆయన, ఇక్కడి నుంచి హైదరాబాద్ హైకోర్టుకు బదిలీ అయిన అసిస్టెంట్ కమాం డెంట్ చంద్రశేఖర్‌తో కలిసి నాగార్జునసాగర్‌లోని ఎస్పీఎఫ్ కార్యాలయంలో సోమవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మాచారి మాట్లాడుతూ ఎస్‌పిఎఫ్ సిబ్బంది ఎటు వంటి వివాదాలకు తావివ్వకుండా అధికారులు, ప్రజలతో మర్యాదగా మెలగాలని సూచించారు. ఏదైనా సమస్య వస్తే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అసిస్టెంట్ కమాండెంట్‌గా చంద్రశేఖర్ నిబద్ధతతో పని చేసి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అసిస్టెంట్ కమాండెంట్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆంధ్ర-తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం నాగార్జున సాగర్‌ప్రాజెక్ట్ అని, అటువంటి సున్నితమైన ప్రాంతంలో ఎటు వంటి వివాదాలు చోటుచేసుకోకుండా సిబ్బంది బాధ్యత గా విధులు నిర్వహించాలని కోరారు. అనం తరం బ్రహ్మాచారి, చంద్రశేఖర్, జెన్కో ఆర్‌ఐ నరేష్‌లను ఉద్యోగులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాగర్ డ్యామ్ ఇన్స్పెక్టర్ భాస్కర్,ఇరిగేషన్ డి ఈ మురళీధర్, ఎస్‌పిఎఫ్ ఎస్‌ఐ విజయ్‌కుమార్, జెన్కో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఎఎస్‌ఐ నరసింహులు, దయానంద్, మట్టారెడ్డి, సక్రు, వెంకటేశ్వరరెడ్డి, డిడి రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# 'స్పందన'తో విశ్వాసం పెంపొందించాలి

ప్రజాశక్తి-నరసరావుపేట

నూజెండ్ల మండలం మృత్యుంజయ పురానికి చెందిన ఆలమంద అచ్చయ్య మరణ ధ్రువీకరణ పత్రం జారీలో పంచాయతి సెక్రటరీ సరిగా స్పందించడం లేదని అచ్చయ్య కుమారుడు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఆ ప్రాంత సచివాలయ పంచాయతి సెక్రటరి చిట్టిబాబుకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎల్.శివశంకర్

***స్పందనలో వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడం ద్వారా దీనిపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ అన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట కలెక్టరేట్ కార్యా లయంలోని స్పందన కాన్ఫరెన్సుహాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరష్కార వేదిక (స్పందన) కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు నుంచి వస్తున్న ఆర్జీలను స్వీకరించి, పరిశీలించి వాటికి వెంటనే పరష్కార మార్గం చూపాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 110 వినతులను ప్రజల నుంచి స్వీకరించారు. స్పందన అర్జీలను ఇచ్చేందుకు వచ్చిన ప్రజలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శాశ్వత సభ్యులు కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన ఎం. శ్రీనివాసులు తన తండ్రి వెంకట సుబ్బయ్య పేరుతో సుమారు 250 మందికి ఉచిత అన్నదానం నిర్వహించారు. అన్నదానం చేసిన దాతలను కలెక్టరేట్ ద్వారా ఘనంగా సత్కరించారు. కలెక్టర్ శివశంకర్, జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.***

### సిరిగిరి పాడుకు రోడ్డు వేయండి

ఆర్ అండ్ బి రోడ్డు నుండి వెల్దుర్తి మండలంలోని తమ గ్రామం సిరిగిరి పాడుకు వెళ్లాలంటే రోడ్డు అధ్వానంగా ఉందని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. 1972 నుండి గ్రామస్తులే ముందుకు వచ్చి గ్రావెల్ వేసి మర మ్మ తులు చేస్తున్నారని, తారు రోడ్డు లేదా సిమెంట్ రోడ్డు వేసి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.



### అవినీతిపై హైకోర్టును ఆశ్రయిస్తా

రైతులకు దక్కాల్సిన పరిహారాన్ని వైసిపి నాయకులు బొక్కేస్తున్నా రని. ఈ-క్రాప్ నమోదులో అక్రమాలపై టిడిపి నియోజకవర్గ ఇన్ ఛార్జి డాక్టర్ చదలవాడ ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదులో అక్రమాలపై విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని కోరారు.రైతుల పేర్లకు వేరొక అకౌంట్ నెంబర్లు జత చేసి రైతులకు అందాల్సిన పరిహారాన్ని కాజేస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇదే తంతు కొనసాగుతోందని ఆరోపించారు. టిడిపి హయాంలో పేదలకు నిర్మించిన టిడ్కో గహాలు ఇవ్వకుండా లబ్ధిదారులని వైసిపి వేదిస్తోందని మండపడ్డారు. లబ్దిదారుల జాబితాను సమాచార హక్కు చట్టం ద్వారా అడిగినా ఇవ్వడం లేదని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నాలుగేళ్లలో నరసరావుపేట మున్సిపాటిలో అవినీతి జరుగుతోందన్నారు. నెలకు రూ 60 నుంచి 70 లక్షల వరకు ఎమ్మెల్యేకు ముడుపులు అందుతున్నాయని ఆరోపించారు. ఎమ్మెల్యే అవినీతికి సహకరించలేక,ఒత్తిడి భరించలేక ఇప్పటికే ఐదుగురు మునిసిపల్ కమిషనర్లు మారారన్నారు. నరసరావుపేట మున్సిపాలిటిలో జరుగుతున్న అవినీతిపై కోర్టును ఆశ్రయిస్తామని చదలవాడ పేర్కొన్నారు.

### పంటను అక్రమంగా తరలించారు



విత్తన కంపెనీ ప్రతినిధులు చెప్పకుండా తన పంటను తీసుకువెళ్లారని గురజాల మండలం పల్లెగుంత గ్రామానికి చెందిన కౌలు రైతు కొనకంచి రామారావు ఫిర్యాదు చేశారు.భారత్ సీడ్స్ విత్తన కంపెనీ ప్రతినిధి, గురజాల మండలం మాడుగుల గ్రామానికి చెందిన ఏచూరి బ్రహ్మం తన 2 ఎకరాలలోని మొక్కజొన్న పంటను అక్రమంగా తరలించారని, ఇదేమని ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. తాను కౌలుకు చేసిన పొలంలో కంపెనీ ప్రతినిధులు తనకు విత్తనాలు ఎరువులు ఇచ్చి పంట కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. నాలుగు ఎకరాలలో పంట అధిక వర్షాలకు దెబ్బతినడంతో ఉన్న రెండెకరాల్లో పంట కోయించి తనకు తెలియకుండా తరలించారని ఫిర్యాదు చేశారు కౌలు, పెట్టుబడులు కలిపి రూ. 3 లక్షల వరకు నష్టపోయానని అన్నారు. ఈ విషయమై గురజాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, తనకు న్యాయం చేయాలని కోరారు.

### పింఛన్ మంజూరు చేసి ఆదుకోండి



మానసిక వికలాంగుడైన తన పదమూడేళ్ళ కుమా రుడికి పెన్షన్ మం జూరు చేసి ఆదు కోవాలని రొంపిచర్ల మండలం అన్నవరా నికి చెందిన గాలి బసవయ్య విన్నవించారు. పలు మార్లు సచివాలయం చుట్టూ తిరిగినా వేలిముద్రలు పడడం లేదని చెబుతున్నారని, కూలి పనులకు వెళితేనే కుటుంబ పోషణ జరుగుతుందని, తన కుమారుడికి సేవలు చేయాల్సిన ఉన్నందున తన భార్య కూలి పను లకు వెళ్లడం కుదరడం లేదని తెలిపారు. తాను ఒక్కడినే కూలికి వెళితే వచ్చే డబ్బులపైనే తమ ఇద్దరు కుమార్తెలు, భార్య తల్లిదండ్రులు బతకాలని, సంపాదన చాలక పస్తులు ఉంటున్నామని వాపోయారు. తన కుమారుడికి వికలాంగ పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతూ భార్య,కుమారుడితో సహా బసవయ్య, కలెక్టర్‌ను వేడుకున్నారు.

### గిరిజనుల సొసైటీ భూములకు రిజిస్ట్రేషన్లు చేయండి

మాచవరం మండలం చెన్నాయపాలెం గిరిజనుల సొసైటీ భూములకు రిజిస్ట్రేషన్లు చేయాలని భారతీయ బహుజన పార్టీ ఆధ్వర్యంలో రైతులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. 1947 నుండి తమ కుటుంబ పెద్దలు అనంతరం తాము తరతరాలుగా సాగు చేసుకుంటున్న అటవీ భూమికి 1956 లో ఉమ్మడి మద్రాస్ రాజధాని ఉన్నప్పుడు తమ పెద్దలు లంబాడి లేబర్ కో ఆపరేటివ్ సొసైటీ గా ఏర్పడి రిజిస్టర్ నెం.174 గా నమోదు చేశారని అన్నారు. సొసైటీ ఏర్పడి 68 ఏళ్లు గడుస్తున్నా 250 ఎకరాలు సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు పట్టాలు ఇవ్వలేదని రైతులు చెప్పారు.



ప్రస్తుతం రీసర్వే జరుగుతున్న నేపథ్యంలో 2010 లో అటవీశాఖ నుండి విడగొట్టిన తమ 250 ఎకరాలకు పట్టాలు మంజూరు చేసి గిరిజన రైతులకు ప్రభుత్వ రాయితీలు అందజేయాలని భారతీయ బహుజన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సంపతి వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గిరిజన రైతుల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. రైతుల నిరసనకు టిడిపి నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చదలవాడ అరవిందబాబు మద్దతు తెలిపారు. 2010లో అటవీ శాఖ నుండి విడగొట్టిన భూములకు పట్టాలు ఇస్తామని ఫారెస్ట్ అధికారులు, భూముల హద్దులు నిర్ణయించారని ఆయన అన్నారు. ప్రభుత్వం చేస్తున్న భూ సర్వే లో అయినా సొసైటీ భూమికి సంబంధించి పట్టాలు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు.

## భూముల అన్యాక్రాంతంపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - యడ్లపాడు

మండల పరిధిలో వేల ఎకరాల ప్రభుత్వ భూములు గతంలో ఖాళీగా ఉన్నాయని, కాల క్రమేణ ఆయా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చోట, బడా నాయ కులు రాజకీయ పార్టీలను అడ్డం పెట్టుకుని అన్యాక్రాంతం చేశారని ఎపి గిరి జన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్య క్షులు బి. శ్రీను నాయక్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం తహశీల్దార్ నాగమల్లేశ్వరరావుకు 'స్పందన'లో వినతిపత్రం అందజేశారు. గత ప్రభు త్వం హయాంలో మండల పరిధిలోని సుమారు 250 ఎకరాల మిగులు భూములు ఉన్నాయని, అసైన్డ్ భూముల కమిటీ తీర్మానం చేసి జిల్లా కలెక్టర్‌ను, తహశీల్దార్, ఆర్డిఒలకు ఆ భూములకు రక్షణగా ఉండాలని, ఆయా వ్యవసాయ భూముల్లో నోటీసు బోర్డులు ఏర్పాటు చేశారని, అయినప్పటికీ పదుల సంఖ్యలో భూములు రాజకీయ పార్టీలకు చెందిన నేతల చేతుల్లో ఎలా వచ్చాయని ప్రశ్నించారు.



భూములను అన్యాక్రాంతం చేసి, దొంగ డాక్యుమెంట్లు సృష్టించి వాటిని కోట్ల రూపాయలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ రీ సర్వేలో ఇందుకు సంబంధించిన వాస్త వాలను నిగ్గు తేల్చి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నిరుపేదలైన ఎస్టీలకు వ్యవ సాయం చేసుకునేందుకు కనీసం 2 ఎకరాల చొప్పున కేటాయించాలని కోరారు.

## క్వారీలో కార్మికుల మృతిపై విచారణ జరపండి

ప్రజాశక్తి-వినుకొండ



మార్చి 24 వ తేదీన స్థానిక తిమ్మాయపాలెం రోడ్ లోని క్వారీలో జరిగిన బ్లాస్టింగ్ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలంటూ సిపిఐ ఎంఎల్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్పందనలో వినుకొండ తహశీల్దార్ కిరణ్ కుమార్ కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా క్వారీకి బ్లాస్టింగ్ అనుమతులు లేకుండా క్వారీ నిర్వాహకులు అక్రమంగా వ్యవ హరిస్తున్నారని అన్నారు. బ్లాస్టింగ్ కారణంగా మృతి చెందిన ఇద్దరు కార్మికుల కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలోతోట ఆంజనేయులు, ఎఐసిసిటియు, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గుంటూరు
5
మంగళవారం 4 ఏప్రిల్ 2023

# కలెక్టర్ స్పందనకు 154 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

స్పందనలో ప్రజలు అందించిన ఫిర్యాదులను గుణాత్మకంగా పరిశీలించి హేతుబద్ధంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి, డిఆర్ఓ కె.చంద్ర శేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం.వెంకట శివరామిరెడ్డి జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 154 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పీ సిఈఓ మోహన్‌రావు, డీఆర్డీఏ, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్లు హరిహరనాథ్, యుగంధర్‌కుమార్, డిపిఓ కేశవరెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూధనరావు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జెసి తదితరులు

## అనధికారిక విగ్రహాన్ని తొలగించాలి



పొన్నూరులో, రేపల్లె బస్టాండ్ వద్ద అనధికారికంగా ఏర్పాటు చేస్తున్న షేక్.యాసిన్ విగ్రహాన్ని తొలగించాలని కలెక్టర్‌కు అర్జీ అందచేశారు. విగ్రహం ఏర్పాటు చేస్తున్న ప్రాంతం నిత్యం ప్రజలు, వాహనాలతో రద్దీగా ఉంటుందని, అటువంటి స్థలాన్ని ఆక్రమించి విగ్రహం ఏర్పాటు చేయటం వల్ల ట్రాఫిక్ సమస్యలు అధికమవుతాయన్నారు. విగ్రహానికి అనుమతులు లేకపోవటం వల్ల లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్నారు. కావున సదరు విగ్రహ ఏర్పాటు పనులు నిలుపుదల చేయాలని కోరారు. అర్జీ ఇచ్చినవారిలో బి.బాబూరావు తదితరులున్నారు.

## పొలానికి వెళ్లే దారిలో గోడ

రైతులు పొలానికి వెళ్లే దారిని అక్రమించి గోడ కట్టటం వల్ల రైతులు తమ పొలాలకు వెళ్లటానికి ఇబ్బంది పడుతున్నారని, పెదకాకాని మండలం, తక్కెళ్లపాడుకు చెందిన రైతులు అర్జీ అందచేశారు. గ్రామంలోని సొసైటీ వారు అక్రమంగా గోడ కట్టారన్నారు. ఈ విషయంపై అక్రమం అని సొసైటీ ఛైర్మన్ కూడా ఒప్పుకున్నారన్నారు. సొసైటీ నిధులు కాజేయటానికే అక్రమంగా గోడ నిర్మించారన్నారు. కావున సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, గోడను తొలగించాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో యం. వేణుకుమార్, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.





అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

# ప్రగతి నగర్‌లో నీటి సమస్యను పరిష్కరించాలి

## జిఎంసి స్పందనకు 47 ఫిర్యాదులు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజల నుండి సమస్యలపై అందే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి హెచ్చరించారు. సోమవారం జిఎంసి కాన్ఫరెన్స్ హాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ తొలుత గతవారం స్పందన ఫిర్యాదుల పరిష్కారం, స్పందన పోర్టల్, ఈ.ఆర్.పి, వాట్సప్, కాల్‌సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదులపై అధికారులతో, సంబంధిత కార్యదర్శులతో సమీక్షించి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.అనంతరం ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. పట్టణ ప్రణాళిక విభాగం 12, ఇంజినీరింగ్ విభాగం 11, ప్రజారోగ్య విభాగం 8, రెవెన్యూ విభాగం 14, ఉపాసెల్ విభాగం 1, అకౌంట్స్ విభాగం సంబంధించి 1, మొత్తం 47 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, ఎస్ఈ భాస్కర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, ఎం.హెచ్.ఓ. డాక్టర్ భానుప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక మహాత్మాగాంధీ ఇన్నర్ రింగురోడ్డులోని ప్రగతి నగర్‌కు ఇంటింటి కుళాయి ఏర్పాటు చేయాలని, అప్పటి దాకా రోజుమార్చి రోజు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సిపియం నగర కమిటీ సభ్యులు కె.శ్రీనివాసరావు కోరారు. సోమవారం ప్రగతి నగర్‌వాసులు స్పందనలో అర్జీ అందచేశారు. గతంలో రోజుమార్చి రోజు ట్యాంకర్లు వచ్చేవని, ఇప్పుడు ఆరు, ఏడు రోజులకు ఒకసారి వస్తున్నాయన్నారు. దీని వల్ల త్రాగునీరు లేక అక్కడ నివశించే ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వారం రోజులకు ఒకసారి ట్యాంకర్లు వస్తే నీరు ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. ఇప్పటికే పైపులైన్లు వేశారని, ఇంటింటికి కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉందన్నారు. కావున తక్షణమే కుళాయి కనెక్షన్లు ఇప్పించి, తమ సమస్య పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో స్థానిక పార్టీ శాఖ కార్యదర్శి జి.బాబు, సహాయ కార్యదర్శి మస్తాన్‌వలి, సభ్యులు రాగి వెంకటేశ్వరరావు, ఓబులేశ్వరి, జి.వెంకటేశ్వర్లు, ఎస్‌కె.గని, నారాయణమ్మ పాల్గొన్నారు.

## రవిచంద్ర ఇన్‌ఫ్రా బిల్డర్లపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి-గుంటూరు :** సకాలంలో ఫ్లాట్లు నిర్మాణం పూర్తి చేయకుండా, 370 కుటుంబాలను రోడ్డున పడేసిన రవిచంద్ర ఇన్‌ఫ్రాటెక్ భాగస్వాములపై చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. స్థానిక మానస సరోవరం సమీపంలో తిరుమల గార్డెన్స్‌లో అపార్ట్‌మెంట్ ఫ్లాట్లు కొనుగోలు చేసి, మోసపోయిన బాధితులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గౌరీ శంకర్ మాట్లాడుతూ 2017లో తిరుమల గార్డెన్స్‌లో 370 మంది అపార్ట్‌మెంట్లు కొనుగోలు చేశామని, 90 శాతం డబ్బు బిల్డర్ తీసుకున్నాడన్నారు.కానీ 30శాతం పైగా వర్క్ పెండింగ్‌లో ఉందని, ఫ్లాట్లు హేండోవర్ చేయలేదన్నారు. కనీసం ఎప్పుడు పూర్తి చేస్తారో కూడా చెప్పట్లేదని వాపోయారు. రుణాలు తీసుకున్న బ్యాంకులు ఇళ్లకు నోటీసులు అంటిస్తున్నారని, వడ్డీలు పెరిగిపోతున్నాయన్నారు. బ్యాంకు లోన్లకు ఇఎంఐలు కట్టలేకపోతున్నామన్నారు. కావున బిల్డర్లు మంచికల పూడి శ్రీనివాసరావు, మంచికలపూడి రజని, ఆలపాటి గోపాలకృష్ణ, ఆలపాటి రవికుమార్‌ను కోర్టు ముందు నిలబెట్టి మాకు న్యాయం చేయాలని కోరారు.



ధర్నా చేస్తున్న బాధితులు

ఫ్లాట్లు కొనుగోలు చేస్తున్నప్పుడు తియ్యటి మాటలు చెప్పి, డబ్బులు వసూలు చేసి, ఇప్పుడు డబ్బులు అయిపోయాయని, మీరే డబ్బులు వేసుకొని పూర్తి చేయండి చెబుతున్నారన్నారు. పద్మావతి మాట్లాడుతూ 2019లో ఫ్లాట్లు ఇస్తామని ఇంత వరకూ ఇవ్వలేదన్నారు. బిల్డరు కనీసం చర్చలకు రావట్లేదన్నారు. చాలా మందికి ఫేక్ ఎన్ఓసిలు ఇచ్చాడని, డిహెచ్ఎల్ఎఫ్ నుండి మాకు నోటీసులు వచ్చాయన్నారు. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని కోరారు. ధర్నాలో కె.మీరాకృష్ణ తదితరులు మాట్లాడారు.

## అడవితక్కెళ్లపాడులో ముగిసిన ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గుంటూరు రూరల్ మండలం, అడవి తక్కెళ్ళపాడులో వారం రోజులపాటు నిర్వహించిన ప్రత్యేక సేవా శిబిరం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా నాగార్జునా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రవిశేఖర్ కార్యక్రమాన్ని సందర్శించారు. సచివాలయ కార్యదర్శి కళ్యాణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ క్యాంపులో ఉచిత వైద్య శిబిరం, ఆరోగ్యం, పరిశుభ్రత, అధికారిక విద్య, సాధారణ ఉపాధిలో లేని యువత సర్వే, నిరక్షరాస్యత నిర్మూలన, ప్లాస్టిక్ నిషేధం, పచ్చదనం తదితర అంశాలపై ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చక్కగా పనిచేశారన్నారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ సిస్టర్ ఫాతిమారాణి, సచివాలయ కార్యదర్శి కళ్యాణ్‌కుమార్ తదితరులు ప్రసంగించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఐ.ఆదిలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ జి.బాలశౌరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




ఎన్ఎస్ఎస్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు



రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లను అభినందిస్తున్న మేయర్

## అధికారులకు మేయర్ అభినందన

ప్రజాశక్తి-గుంటూరు

2022-23 సంవత్సరానికి జిఎంసి రెవెన్యూ (ఆస్తి పన్ను) వసూళ్లు 84 శాతం వసూలు చేయటం అభినందనీయమని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు అన్నారు. రెవెన్యూ వసూళ్ళు పెంపుదలకు కృషి చేసిన రెవెన్యూ అధికారులు, ఇన్స్పెక్టర్లను సోమవారం మేయర్ ఆయన ఛాంబర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆస్థి పన్నుపై వడ్డీ మినహాయిస్తూ జి.ఓ.34 జారీ చేసిందని ఫలితంగా జిఎంసి పరిధిలో రూ.146 కోట్ల బకాయిలకుగాను రూ.115 కోట్లు వసూలు అయ్యాయని, ఈ కృషిలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాత్ర గణనీయంగా ఉందన్నారు. 2023-24కు ఏప్రిల్‌లో చెల్లిస్తే 5 శాతం రాయితీ లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు యస్.యన్.ప్రసాద్, బాలాజీ భాష, రవికుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న పెన్షనర్లు

## కలెక్టరేట్‌లో విశ్రాంత ఉద్యోగులు నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెన్షనర్ల సమస్యలపై సోమవారం కలెక్టరేట్‌లోని సంఘ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎపిజెఎసి అమరావతి పిలుపు మేరకు ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్ విడుదల చేయాలని, ఈహెచ్ఎస్ కార్డుపై గుర్తించిన ఆసుపత్రుల్లో వైద్యం అందించాలని, పెండింగ్‌లో ఉన్న డిఎ బకాయిలు 2018 జులై నుంచి రావాల్సివి చెల్లించాలని, 3 విడతల డిఎలను ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సిహెచ్.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.నాగరాజు, ఎ.సుబ్బారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనల మేరకు భూమి కొనుగోలు

### శాలినీ డెవలపర్స్ డైరెక్టర్ లక్కాకుల థామస్‌నాయుడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



నల్లపాడు గ్రామంలో తాము కొనుగోలు చేసిన భూమికి ఎటువంటి వివాదాలు లేవని శాలిని డెవలపర్స్ డైరెక్టర్ లక్కాకుల థామస్ నాయుడు వెల్లడించారు. గుంటూరులో సోమ వారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర హైకోర్టులో 2013 నుంచి 5 సంవత్సరాల పాటు విచారణ అనంతరం కోర్టు తీర్పు మేరకు అప్పటి టిడిపి ప్రభుత్వ హయంలోనే రెవెన్యూశాఖ అనుమతితో భూమిని కొనుగోలు చేసినట్టు తెలిపారు. అప్పటి స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ మన్మోహన్‌సింగ్ ఉత్తర్వులతో... 2018 సంవత్సరం అధికారికంగా పట్టా పొందిన వారి నుంచి భూమి కొనుగోలు చేసినట్టు తెలిపారు. వైసిపి ప్రభుత్వం హయంలో భూమిని దక్కించుకున్నామని జరుగుతున్న ప్రచారంలో నిజం లేదన్నారు. ఎటువంటి వివాదాలు లేవని నిర్ధారించుకున్న తరువాతనే 4 ఎకరాల 39 సెంట్ల స్థలాన్ని కొన్నట్టు తెలిపారు. చుక్కల భూమి నుంచి తాము మినహాయింపు పొందలేదన్నారు. శాలినీడెలపర్స్‌పై కొంత మంది పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. అటువంటి వారిపై పరువునష్టం కేసు దాఖలు చేస్తామని ఆయన వివరించారు. సమావేశంలో శాలినీ డెవలపర్స్ డైరెక్టర్లు కొంపల్లి మధు, గొరిజాల శ్రీనివాసరావు, లక్కాకుల ఆరోగ్యరాణి, గొరిజాల కోటేశ్వరి, కొంపల్లి మాల్యాద్రి, వడ్రాణం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




## అమరావతిలో ట్రాఫిక్‌కు అంతరాయం

ప్రజాశక్తి-అమరావతి

అమరావతి మండల కేంద్రంలో ఆక్రమణలు రాక పోకలకు అడుగడుగునా అడ్డంకులుగా మారుతున్నాయి. అమరావతి నుండి క్రోసూరు వెళ్లే రోడ్డు ఇరుకు సందును తలపిస్తోంది. ధరణికోట ఆర్ వి వి ఎన్ కళాశాల, కాలచక్ర రహదారిలో స్థానిక బస్టాండు నుంచి అంబేద్కర్ బొమ్మ వరకు రోడ్డుఆక్రమణల పాలైంది. అమరావతిలో పర్యాటకులు అనునిత్యం రాకపోకలతో నిత్యం రద్దీగా ఉందని అనుకుంటే మరో పక్క ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు.



## ఘనంగా వసంత సేవ

ప్రజాశక్తి-సత్తెనపల్లి

శ్రీరాముల నవమి పందిర్ల వద్ద వసంత సేవా కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలోని 25వ అవార్డు వావిలాల వీధిలో శ్రీరామనవమి సం దర్భంగా ఏర్పాటు చేసిన పందిరి వద్ద ఐదు రోజుల కార్యక్రమాల్లో భాగంగా చివరి రోజు సోమవారం వసంత సేవ నిర్వహిం చారు. ఈ సందర్భంగా మహిళల కోలాటం ఆకట్టుకుంది. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకులు కటకం అన్నపూర్ణ, పొట్టి శారద, పొట్టి మంజులవాణి, కూరపాటి జయమ్మ, కోట నాగ వర లక్ష్మి, రంగా రమాదేవి, పెరుమాళ్ళ రాజేశ్వరి,కూరపాటి హేమ, దేవిశెట్టి శివరామ స్వామి, దేవి శెట్టి మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## చిత్ర కళాకారుడు ప్రసాద్‌కు పురస్కారం

ప్రజాశక్తి-వినుకొండ

పట్టణానికి చెందిన ప్రముఖ చిత్ర కళాకారుడు బొడ్డుచర్ల ప్రసాదరావు కు మహానంది పురస్కారం లభించింది. ఈ నెల 2న ఎఎన్ఎస్ (వేయి గొంతు కుల వేదిక) విజయవాడ బసవపున్నయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన ఉగాది మహానంది పరిష్కార మహాసభలో ప్రసాద్‌కు ఈ అవార్డు ను బహూ కరించారు. కళ, సాహిత్యం,సంగీతం వివిధ సేవా రంగాల్లో సేవలందించినందుకు గాను ఆయనకు ఈ పురస్కారం అందజేశారు. ప్రసాద్ మాట్లాడుతూ మహానంది పుర స్కారం అందుకోవడం తనకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ పురస్కారం పెనుకొండ ప్రజలకు చెందుతుందని అన్నారు.

# టెన్త్ పరీక్షలు ప్రారంభం



ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

పదో తరగతి పరీక్షలు సోమవారం నుండి ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల కల్లా విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు.సత్తెన పల్లి మండలంలో ఐదు పరీక్షా కేంద్రాల్లో జరి గిన పది పరీక్షలకు 760 మంది విద్యా ర్థులు హాజరయ్యారు. కొమెర పూడి, నంది గామ, రామకృష్ణాపురం గురుకుల పాఠ శాల, ఫణిదం, భృగుబండ జిల్లా పరిషత్ హైస్కూల్స్ లో పరీక్షా కేంద్రాలను అధికా రులు ఏర్పాటు చేశారు. 782 మంది విద్యా ర్థులకు గాను 760 మంది హాజరయ్యారు. పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచిన ప్రశ్నా పత్రాలను పోలీస్ బందోబస్తు మధ్య పరీక్షా కేంద్రాలకు తరలించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు 144 సెక్షన్ విధించారు. రవాణా సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ప్రత్యేక ఆటోల్లో పరీక్షలకు హాజరయ్యారు, విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత పరీక్షా కేంద్రంలోకి అనుమతిచ్చారు. పరీక్షా కేంద్రాలను తహశీల్దార్ కె.నగేష్ తనిఖీ చేశారు.



ప్రజాశక్తి-కారెంపూడి

పదవ తరగతి పరీక్ష కేంద్రాలను కారెంపూడి తహశీల్దార్, మండల మేజిస్ట్రేట్ శ్రీనివాస్‌యాదవ్ తనిఖీ చేశారు. మండలంలోని మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రం,జిల్లా పరిషత్ హైస్కూల్, సెయింట్ జాన్స్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులకు అవసరమైన వసతుల ఏర్పాటు చేశారా లేదా అనే విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో 716 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయాల్సి ఉండగా 706 మంది పరీక్షలకు హాజరయ్యారని, పది మంది గైర్హాజరైనట్లు వివరించారు. తహశీల్దార్ వెంట ఎంఇఒ నాగయ్య పాల్గొన్నారు.


ప్రజాశక్తి-నకరికల్లు

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 186 మంది విద్యార్థులకు గాను 184 మంది హాజరైనట్లు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. విశ్వశాంతి టెక్నో స్కూల్లో 203మంది విద్యార్థులకు గాను 202 హాజరైనట్లు పరీక్షా కేంద్ర చీఫ్ సూపర్డెంట్ శేషగిరి రావు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయి బందోబస్తు నిర్వహించారు.



ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలో ఏడు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు మాచర్ల మండల పరిధిలో మొత్తం తొమ్మిది పరీక్ష కేంద్రాలు ఉండగా, ఏడు మాచర్ల పట్టణంలో, రెండు విజయపురి సౌత్ పరిధిలో ఉన్నాయి మండల పరిధిలో మొత్తం 1486 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. వెల్దుర్తి మండలంలోని కస్తూరిబా పాఠశాల, మోడల్ స్కూల్ లకు చెందిన విద్యార్థుల 40 మంది కూడా మాచర్ల పట్టణంలోని పరీక్ష కేంద్రాల్లోనే పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు ఎంఈఓ వేముల నాగయ్య మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల కోసం అన్ని వస్తు సౌకర్యాలు ఉన్నట్లు తెలిపారు



ప్రజాశక్తి-అమరావతి

మండల కేంద్రమైన అమరావతిలో పదవ పరీక్షలకు 548 మంది విద్యార్థులు హాజరయ్యారు. స్థానిక శ్రీ రామకృష్ణ హిందు హైస్కూల్, బాలయోగి బాలిక గురుకుల పాఠశాలలో 554 మంది విద్యార్థులకు గాను ఆరుగురు విద్యార్థులు హాజరు కాలదని మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస రావు తెలిపారు.

ప్రజాశక్తి-నాదెండ్ల

పదో తరగతి పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓ ఆంజనేయులు తెలిపారు. మండలంలో మొత్తం మూడు పరీక్ష సెంటర్లు సాతులూరు పరీక్ష సెంటంలోని 241 మంది విద్యార్థులు పరీక్షక హాజరు కావాల్సి ఉండగా ఒక విద్యార్థి గైర్హాజరయ్యారని, చిరుమామిళ్ల పాఠశాలలో 192 మంది విద్యార్థులు పరీక్ష హాజరు కావాల్సి ఉండగా ఒక విద్యార్థి గైర్హాజరయ్యారని, నాదెండ్ల పరీక్ష సెంటర్ లో 116 మంది విద్యార్థులు పరీక్షలు హాజరైనట్టు తెలిపారు.



ప్రజాశక్తి-రొంపిచర్ల

మండలంలోని వి.రెడ్డిపాలెం ఎపి మోడల్ స్కూల్, వి.రెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.మండలంలో మొదటి రోజున జరిగిన పరీక్షకు మొత్తం 501 విద్యార్థులకు గాను ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఇఓ కె.పి.బాబురెడ్డి తెలిపారు. ఆయా పరీక్షా కేంద్రాలను సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు మాచర్ల ఎంఇఓ నాగయ్య, తహశీల్దార్ జి.అంకారావు,ఎస్ ఐ సురేష్ లు తనిఖీ చేశారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజాశక్తి-విజయపురిసౌత్

స్థానిక ప్రభుత్వఉన్నత పాఠశాలలో 92 మంది విద్యార్థులకు గాను 91 మంది, పిటిజి పాటశాల పరీక్షా కేంద్రంలో 187 మంది రెగ్యులర్,నలుగురు సప్లిమెంటరీ విద్యార్థులు మొత్తంగా 191 మంది హాజరు కావాల్సి ఉండగా ఒకరు గైర్హాజరయ్యారని తెలిపారు. విజయపురిసౌత్ లో మొత్తం 281 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఎస్ఐ పి.అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.






ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండల కేం ్రదంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో పరీక్షలు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలో 249 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 247 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ ఎగ్జామినర్ ఎన్.సిద్దయ్య తెలిపారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాన్ని తహశీల్దార్ భవానీశంకర్, ఎంపిడివో శ్రీనివాసరావు తనిఖీ చేసి మౌలిక సదుపాయాలు పరిశీలించి ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పరీక్ష సజావుగా సాగే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ఆరేపల్లి ముప్పాళ్ళ, ఈపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.ముప్పాళ్ళ పరీక్షా కేంద్రంలో 198 మంది విద్యార్థులకు గాను 197 మంది హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారిని విజయ కుమారి తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని ఎంపిడిఒ ఎ. ఉషాకిరణ్ సందర్శించారు. మండల కేంద్రం ఈపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 240 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారిని జయశ్రీ తెలిపారు.

## ప్రజాపోరులో భాగస్వాములు కండి

ప్రజాశక్తి-అచ్చంపేట

ప్రజా పోరులో ప్రజలందరూ ప్రతి ఒక్కరూ భాగస్వామి కావాలంటూ సిపిఐ కార్యదర్శి మురగోడి శ్రీనివాసరావు అన్నారు సోమవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతి రేక విధానాలను ఎండగట్టేందుకు వామపక్షాల ఆధ్వర్యంలో ఈ నెల 14 నుండి 30వ తేదీ వరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న ప్రజాపోరులో భాగంగా పాదయాత్రను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి బైరాపట్ట రామకృష్ణ పిలుపునిచ్చారు. ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ వర్గాలపై రోజు రోజుకూ పెరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రజలు సమైక్య ఉద్యమానికి నాంది పలకాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఐ నాయకులు పున్న కోటేశ్వరరావు, చెలికాని అశోక్, బి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.



## ఆసరా కాదు.. టోకరా: మాజీ ఎమ్మెల్యే వైవి

ప్రజాశక్తి-రాజుపాలెం

ఆసరా పేరుతో డ్వాక్రా అక్కా చెల్లెమ్మలను వైసిపి దగా చేస్తూ టోకరా వేస్తోం దని, బటన్ నొక్కి పది రోజులైనా ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని,రోజు పనులు మానుకొని బ్యాంకు ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే వై వి ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. రాజుపాలెం మండలం కొత్తూరు గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో వై వి ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

## 'దళిత క్రిస్టియన్లను ఎస్సీ జాబితాలో చేర్చడం రాజ్యాంగ విరుద్ధం'

ప్రజాశక్తి-అమరావతి

ఎస్సీ క్రిస్టియన్లను ఎస్సీలలో చేర్చాలని అసెంబ్లీ తీర్మానం చేయడంపై భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా విమర్శలు గుప్పించింది. ఎస్సీ మోర్చా మహిళా అధ్యక్షురాలు బంక స్వాతి ఆధ్వర్యంలో తహశీల్దార్ విజయ శ్రీకు సోమవారం వినతి పత్రం అందించారు.ఈ తీర్మానం రాజ్యాంగ విరుద్ధమని, ఇటువంటి రాజ్యాంగ విరుద్ధమైన తీర్మానాలను వైసిపి ప్రభుత్వం తీర్మానించడం రాజ్యాంగాన్ని ధిక్కరించడమేనని అన్నారు. వైసిపి ప్రభుత్వం తక్షణమే ఈ తీర్మానాన్ని ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా తమ నిరసనలు తెలిపారు. పల్నాడు జిల్లా అధ్యక్షులు ఆలోకం సుధాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


మరమ్మతులకు రన్నింగ్ రూమ్ సెంటర్‌లో రోడ్డు పక్కన తీసిన గుంట


తాగునీరు అందించాలని వినతి పత్రం అందజేస్తున్న మహిళలు ,సోలా ముత్యాలరావు

- దోసిళ్లతో బిందెల్లో పట్టుకుంటున్నా పట్టని వైనం
- 20 ఏళ్ల క్రితం వేసిన పైప్ లైన్‌లకు లీకులు
- యుద్ధప్రాతిపదికన నూతన పైప్‌లు వేసి తాగునీరు ఇవ్వాలంటున్న స్థానికులు

# తాగునీరు కష్టం తెలిసేదెవరికి..!

**ప్రజాశక్తి-తాడేపల్లి**

వేసవి కాలంలో తాగునీటి కష్టాలు ఎవరూ తీర్చలేకపోతున్నారు. గుక్కెడు నీళ్ల దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులలో మాత్రం ఎటువంటి చలనం ఉండటం లేదు. ఇదే పరిస్థితి తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం కూత వేటు దూరంలో ఉన్న కొత్త వడ్డెర కాలనీ, ఎస్‌సి కాలనీ పరిసర ప్రాంతాల్లో తేట తెల్లమౌతుంది. ఇక్కడ నీరు పట్టుంకోవాలంటే దోసిళ్లతో నీటిని వడిసి పట్టి బిందె నింపుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి ఏప్రిల్, మే నెలల్లో మరింత తీవ్రంగా ఉండబోతుందని స్థానిక కాలనీల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో తాగునీరు ఇంటి ముందు కుళాయిలతో వచ్చేదని ప్రస్తుతం వాటి నీరు సరిగా రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం ఒక బిందె తాగునీరు తెచ్చుకోవాలం టే గంటలు తరబడి వేచి చూడాల్సి వస్తుందని, వాపోతున్నారు. పైపు లైన్లు ఎప్పుడో సుమారు 20 ఏళ్ల క్రితం వేసిన పైపులైన్ల అవడంతో అవి పూర్తి పాడై పోయి తాగు నీరు సరిగా అందడం లేదని చెబుతున్నారు. పైపు లైన్లు మరమ్మతులు కాని, కొత్తగా ఈ ప్రాంతంలో పైపులైన్ ఏర్పాటు చేస్తే తప్ప తమకు తాగునీటి కష్టాలు తీరవని వాపోతున్నారు. కృష్ణానది పక్కనే ఉన్నా తమకు ఈ నీటి కష్టాల ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సిఎం నివాసం పక్కనే ఉన్నా తాగునీరు లోటాలతో పట్టుకోవాల్సి దుస్థితి ఎందుకు వచ్చిందని వాపోతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు ఈ ప్రాంతంలో తాగునీటి పైపులైన్ వేసి తమకు తాగునీరు అందించాలని కోరుతున్నారు. తాగునీటి సమస్య తీవ్రత ఇటీవల స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దృష్టికి కూడా వచ్చింది. పది రోజుల క్రితం జరిగిన సమీక్షా సమావేశంలో ప్రజలకు తాగడానికి గుక్కెటు తాగునీరు ఇవ్వని ప్రజాప్రతినిధిగా నేనెందుకు, అధికారులుగా మీరెందుకని గట్టిగానే సమావేశంలో అధికారులను హెచ్చరించారు. ఇప్పటికైన అధికారులు యుద్ధప్రాతిపదికన తమకు తాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కొత్త వడ్డెర కాలనీ, ఎస్‌సి కాలనీ వాసులు కోరుతున్నారు.

### మరమ్మతులకు తీసిన గుంత పూడ్చాలి ..

రన్నింగ్ రూమ్ సెంటర్‌లో తాడేపల్లి మెయిన్‌రోడ్డు పక్కనే పైపులైన్ మరమ్మతులకు ఇంజనీరింగ్ సిబ్బంది తీసిన గుంతను వెంటనే పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డు పక్కనే గుంత ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ ప్రాంతంలో రాత్రి పూట చీకటిగా ఉండటంతో ప్రమాదవశాత్తు ఈ గుంతలో పడి గాయాల పాలవుతున్నామని వాపోయారు. నాలుగు రోజల క్రితం కూడా ఇద్దరు పాఠశాల విద్యార్థులు ఈ గుంతలో పడి గాయాలపాలయ్యారని. వెంటనే గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

### నూతన పైపులైన్ వేయాలి : సిపిఎం

రన్నింగ్ రూమ్ సెంటర్‌లోని కొత్త వడ్డెర కాలనీ, ఎస్‌సి కాలనీ వాసుల మంచినీటి సమస్య దమ దృష్టికి వచ్చిందని సిపిఎం నాయకులు సోలా ముత్యాలరావు తెలిపారు. ఇటీవల తాము ఆ ప్రాంతంలో పర్యటించినప్పుడు చిన్నపాటి లోటాలతో బిందెలు నింపుకోవడం తాము కళ్లారా చూసామని చెప్పారు. గతంలో 20 ఏళ్ల క్రితం వేసిన పైపులైన్ పాడైపోయి ఉండటం వల్ల నీళ్లు రావడంలేదనే అభిప్రాయం ఇక్కడ ప్రజల్లో ఉందని చెప్పారు. వెంటనే ఈ ప్రాంతంలో నూతన పైపులైన్ వేసి పేదల మంచినీటి కష్టాలు తీర్చాలని కోరారు. ఆ మేరకు సోమవారం ఆరో వార్డు సచివాలయంలో స్థానిక మహిళలతో కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై అడ్మిన్ స్పందిస్తూ సమస్య తమ దృష్టిలో కూడా ఉందని, పైపులైన్ ఏర్పాటుకు తగిన ప్రతిపాదనలు కూడా సిద్ధం చేస్తున్నారని తెలిపారు. త్వరలోనే అక్కడ మంచినీటి సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు.



## కోదండ రామాలయంలో అన్నదానం

**ప్రజాశక్తి -మంగళగిరి**

మంగళగిరి బాపనయ్య నగర్లో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామస్వామివారి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో 5వ రోజు సోమవారం నిర్వహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సందర్శకులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కోలా శ్రీనివాసరావు, గాజుల క్రాంతి కుమార్, కిషోర్, రెడ్డి ఆంజనేయులు, భక్త బృందం ప్రతినిధులు అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, కదం రాంబాబు, వడ్లమూడి వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిస్థలాల కొత్త దరఖాస్తులకు రావొద్దు

**నిరాశతో వెనుదిరిగిన అర్జిదారులు**

**ప్రజాశక్తి- మంగళగిరి**

మంగళగిరి - తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో గృహాలు, నివేసన స్థలాలు లేని వారికి ప్రభుత్వం ఇంటి స్థలాలను కేటాయించనుంది. ఇందుకు సంబంధించి ధరఖాస్తులు చేసుకోవాలని ఎమ్మెల్యే ఆర్కే సూచించారు. అయితే సోమవారం మంగళగిరి పట్టణంలోని వడ్లపూడి సెంటర్‌లో ఉన్న 7వ సచివాలయం వద్దకు ఓ మహిళ వెళ్ళి విఆర్‌ఓని ని ధరఖాస్తు చేయాలని కోరగా..2024 వరకు తమ వద్దకు రావొద్దని, కేవలం గతంలో ఇచ్చిన ధరఖాస్తుల వెరిఫికేషన్ మాత్రమే జరుగుతుందని స్పష్టం చేశారు. దీంతో ఆశతో సచివాలయం మెట్లెక్కిన ప్రజలు నిరాశతో వెనుదిరిగారు. దీనిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు సిబ్బందికి స్పష్టంమైన ఆదేశాలు జారీచేసి కొత్తవారికి సైతం ధరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.


ఇదే ఖర్మ రాష్టాని పోస్టర్ చూపుతున్న టిడిపి నాయకులు

## 'వైసిపిని ప్రభుత్వాన్ని సాగనంపాలి'

**ప్రజాశక్తి మంగళగిరి**

అసమర్ధ వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి సాగనంపాలన టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంద్రు శ్రీనివాసరావు విమర్శించారు. సోమవారం పట్టణంలోని పదో వార్డులో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ప్రజలు ఓటు ద్వారా వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోవాడ దుర్గారావు, వంగర హనుమాన్, సింహాద్రి రామారావు, వాకా మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



## చిరు వ్యాపారులకు చెక్క బల్ల బండ్లు పంపిణీ

**ప్రజాశక్తి- మంగళగిరి**

పట్టణంలో నలుగురు చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సహకారంతో సోమవారం ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో వైసీపీ నాయకులు చెక్క బల్ల బండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు మునగాల మల్లేశ్వరరావు, వైసిపి నాయకులు సంకే సునీత, ఎం సుధారాణి, సంక బాలాజీ గుప్తా, ఎండి ఫిరోజ్, ఆకురాతి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ప్రారంభమైన 'పది' పరీక్షలు

**ప్రజాశక్తి-తెనాలి**

పదోతరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం 12.30 వరకూ జరిగిన పరీక్షకు ఉదయం ఏడున్నర నుంచి విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవటం ప్రారంభించారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను ఆయా సంస్థల వాహనాల్లో పరీక్ష కేంద్రాలకు చేర్చగా, కొందరిని తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో పరీక్ష కేంద్రాలకు చేర్చారు.

**ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్**

మండలంలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పెదనందిపాడు జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 248 మంది విద్యార్థులలకు 244 మంది విద్యార్థులు హాజరయ్యారని, అబినేని గుంట పాలెంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 134 మంది విద్యార్థులకు హాజరు కావాల్సి ఉండగా 131 మంది పరీక్షలకు హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి డి.బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.


కొత్తపేట బాలుర ఉన్నత పాఠశాల వద్ద పది విద్యార్థులు


రత్తయ్యను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు ,పార్టీ నాయకులు

## పౌరాణిక నాటక కళాకారుడు రత్తయ్యకు సత్కారం

**ప్రజాశక్తి-తెనాలిరూరల్**

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటర్‌లో సోమవారం ఎన్టీఆర్ నటించిన పరువుప్రతిష్ట చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. ఉత్సవాల్లో రోజుకొక కళాకారులను సన్మానించే కార్యక్రమంలో పట్టణ పౌరాణిక, సాంఘిక నాటక కళాకారుడు అద్దంకి రత్తయ్యను పార్టీ నాయకులు తాడిబోయిన హరిప్రసాద్, పినపాటి రవీంద్ర, సోమవరపు సాంబశివరావు, చందు హేమంత్, వినుకొండ శ్రీరామమూర్తి తదితరులు సత్కరించి ఎన్టీఆర్ జ్ఞాపికను అందించారు. థియేటర్ కమిటీ సభ్యులు పెమ్మసాని పోతురాజు, ఈదర శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జగన్, ఎం రాఘవరావు, ఎం. వెంకట్, కృష్ణారావు, దుర్గ, మధు తదితరులు పాల్గున్నారు.


భవనాన్ని పరిశీలిస్తున్న నాట్స్ అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరి

## భవన నిర్మాణానికి సహకారం అందిస్తాం

**ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్**

పెదనందిపాడులో తేళ్ల నారాయణ విజ్ఞానకేంద్రం భవన నిర్మాణానికి తమ వంతు సహకారం అందజేస్తామని ఉత్తర అమెరికా తెలుగు సంఘం(నాట్స్)అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరి(బాపు) అన్నారు. సోమవారం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా విజ్ఞాన కేంద్రం నిర్మాణ కమిటీ సభ్యులు కుర్రా హరిబాబు, కాకుమాను నాగేశ్వరరావులతో మాట్లాడుతూ భవన నిర్మాణానికి వారు చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమానికి తన సహకారాన్ని కూడా అందజేస్తామన్నారు. బాపయ్య చౌదరితో పాటు మాజీ ఎంపిపి నర్రా బాలకృష్ణ, దాసరి వెంకట సుబ్బారావులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జంగాల అజయ్ కుమార్

## నిరంకుశ విధానాలపై 14 నుంచి ప్రచారోద్యమం

**ప్రజాశక్తి- మంగళగిరి**

కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్, మతోన్మాద అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఈనెల 14వ తేదీ నుండి 30వ తేదీ వరకు జరిగే ప్రచార ఉద్యమాన్ని ఇంటింటికి తీసుకెళ్లాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం మంగళగిరి సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ సిపిఐ సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ నాయకులు ఏ ప్రభాకర్ అధ్యక్షత వహించారు. అజయ్ కుమార్ మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు పెట్రోల్ డీజిల్ ధరలను నియంత్రించలేని పరిస్థితిలో కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఉందని విమర్శించారు. సమావేశంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నియోజవర్గ నాయకులు కె. కాశియా, జాలాది జాన్ బాబు, వై . వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు చిన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం జగన్ పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు

## సభకు 40-50 వేల మంది వస్తారని అంచనా - పరిశీలించిన మంత్రి, ఎమ్మెల్సీలు, అధికారులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఫ్యామిలీ ఫిజీషియన్ రాష్ట్రవ్యాప్త కార్యక్రమాన్ని చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల నుండి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 6న ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను అధికారులు ముమ్మరం చేశారు. 40-50 వేలమంది వస్తారని అంచనా వేస్తున్నారు. అందుకు అనుగుణంగా 50 ఎకరాలను ఎంపిక చేయగా ఇందులో 15-20 ఎకరాల్లో సభ వేదిక నిర్మిస్తున్నారు. సభకు హాజరయ్యే ప్రజలు, వాహనా పార్కింగ్ తదితరాలకు ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించారు. ఏర్పాట్లను ఎమ్మెల్సీలు తలసిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డితో కలిసి రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని సోమవారం పరిశీలించారు. ఎండలతోపాటు రంజాన్ మాసమూ కావడంతో ఉపవాసంలో ఉన్నవారూ సభకు వచ్చినప్పుడు ఇబ్బందులేమీ తలెత్తకుండా ప్రత్యేక చర్యలకు ఆదేశించారు. సభకు హాజరైన అందరికీ మజ్జిక, తాగునీరుతోపాటు ఇళ్లకు తిరిగివేళ్లేటప్పుడు అందించడానికి భోజనాలనూ ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు అధికారులు, కార్యక ర్తలు పనుల్లో తనమునకలయ్యారు. పరిశీలనలో పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, తహశీల్దార్ జి.సుజాత, కమిషనర్ గోవిందరావు పాల్గొన్నారు.




సభావేదిక వద్ద పనులు, పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్సీలు, అధికారులు

### సిఎం పర్యటనపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి - నరసరావుపేట

ఫ్యామిలీ ఫిజీషియన్ రాష్ట్రవ్యాప్త కార్యక్రమాన్ని చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల నుండి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 6న ప్రారంభించనున్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో కార్యక్రమ నిర్వహణపై అధికారులతో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సోమవారం సమీక్షించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు ఇబ్బందులేమీ తలెత్తకుండా ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని చెప్పారు. కార్యక్రమానికి ఎఎన్ఎంలు అందరూ హాజరయ్యేలా చూడాలన్నారు. మజ్జిగ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని, పార్కింగ్ సమస్య రానివ్వొద్దని చెప్పారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, డిఆర్ఒ వినాయకం, ఆర్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మాజీ సైనికోద్యోగులు

# వినుకొండలో మాజీ సైనికోద్యోగుల నిరసన

## వన్ ర్యాంక్ వన్ పెన్షన్ కోసం ఢిల్లీలో జరుగుతున్న ధర్నాకు సంఘీభావం

ప్రజాశక్తి - వినుకొండ

న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద దేశవ్యాప్తంగా మాజీ సైనికోద్యోగులు చేస్తున్న ధర్నాకు సంఘీభావంగా వినుకొండలో సోమవారం నిరసన చేపట్టారు. మాజీ సైనిక ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయం వద్ద నిరసనలో సంఘ అధ్యక్షులు కొత్తపల్లి ఈశ్వరయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 'వన్ ర్యాంక్ వన్ పెన్షన్' (ఒఆర్ ఒపి) కోసం కొన్నేళ్ళుగా పోరాడుతున్నామని, తాము అధికారంలోకి వస్తే అమలు చేస్తామంటూ 2014లో నరేంద్రమోడీ వాగ్దానం చేశారని చెప్పారు. అయితే అనంతరం కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినా 2.57 నామమాత్రపు ఫిట్మెంట్‌తో చేతులు దులిపేసుకుందని విమర్శించారు. ఒఆర్ ఒపి ఇవ్వకుండా ఐదేళ్లకోసారి పెంచుతున్నారని, తాజాగా పదేళ్లు దాటినా దానికి దిక్కులేదని అన్నారు. ప్రస్తుతం 8వ పే వచ్చిందని, దీన్నీ ఇస్తారో? లేదో? తెలియడం లేదని, ప్రస్తుతం అమలవుతున్న ఒఆర్ ఒపిలో 1, 2లో అనేక అవకతవకలు జరిగాయన్నారు. ఒఆర్/జెసిఓస్‌కు చాలా అన్యాయం జరిగిందని చెప్పారు. వితంతువులకు, వికలాంగులకు, వీరనారీలకు, కార్గిల్లో చనిపోయిన వారి కుటుంబాలకు ఇదే విధంగా మెడికల్ వెటర్నర్స్‌కు కానీ ప్రయోజనమేమీ లేదని తెలిపారు. ఒఆర్ ఒపిలో, ర్యాంకుల్లోనూ అన్యాయం జరిగిందని తెలుస్తోందని చెప్పారు. నిరసనలో సుబేదార్ మేజర్ రవిశంకర్, హవాల్దారులు జిపి రెడ్డి, మురళీకృష్ణ, జి.రాధాకష్ణ, ఎస్.భాస్కరరావు, ఎం.సుబ్బారావు, నిర్మలాదేవి, సుందరమ్మ పాల్గొన్నారు.



రథాన్ని గ్రామంలోకి తీసుకొస్తున్న రైతులు

# తుళ్లూరుకు చేరిన అమరావతి రథం

ప్రజాశక్తి - తుళ్లూరు

అమరావతి రథం సోమవారం రాత్రి తుళ్లూరు చేరుకుంది. అరసవల్లి నుంచి వచ్చిన రథాన్ని రైతులు తుళ్లూరు - రాయపూడి మధ్య నుంచి గ్రామాల్లోకి తెచ్చారు. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని రైతులు చేస్తున్న ఉద్యమం గతేడాది సెప్టెంబర్ 12వ తేదీకి 1000 రోజులు పూర్తయ్యింది. ఆ నేపథ్యాన్ని పురస్కరించుకొని రాజధాని ప్రాంతం వెంకటపాలెం నుంచి అరసవల్లి వరకు రైతులు పాదయాత్ర చేపట్టారు. పోలీసులు పాదయాత్రకు అడ్డంకులు కల్పిస్తున్నారంటూ అక్టోబర్ 22న రైతులు పాదయాత్ర నిలిపివేశారు. దీంతో రైతుల వెంట తీసుకువెళ్లిన రథం కూడా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురంలో ఆగిపోయింది. తిరిగి రైతులు శుక్రవారం రథయాత్రను అరసవల్లి వరకు చేశారు. రథయాత్ర ఆదివారంతో ముగియడంతో రథాన్ని అరసవల్లి నుంచి తుళ్లూరు చేరుకుంది. రైతులు, మహిళలు జై అమరావతి అంటూ రథం వెంట నడిచారు. ఇదిలా ఉండగా రాష్ట్ర రాజధాని అమరావతినే కొనసాగించాని రైతులు చేస్తున్న ఆందోళనలు సోమవారంతో 1203వ రోజుకు చేరాయి. తుళ్లూరు, నెక్కల్లు, వెలగపూడి, వెంకటపాలెం, అనంతవరం తదితర గ్రామాల్లో రైతుల దీక్షలు కొనసాగాయి. అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించారు.

# వాగ్దానాలను నెరవేర్చకుంటే ఎంపీల రీకాల్

## కెఎల్‌యు మాక్ పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

భారత పార్లమెంటు వ్యవహారాలు, రాజకీయాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని కెఎల్.విశ్వవిద్యాలయం ఆర్ట్స్ విభాగాధిపతి డాక్టర్ వెంకటేశ్వర్ కుమార్ అన్నారు. సోమవారం ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు మాక్ పార్లమెంటు సందర్భంగా రాజనీతి శాస్త్రంలోని ఆయా విభాగాల గురించి ఆయన వివరించారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య పార్లమెంటు వ్యవస్థ మనదని, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ లాంటి మేధావులు భారత పార్లమెంటులో తమ ప్రసంగాలతో ప్రతిపక్ష నాయకులను సైతం ఆకట్టుకునే వారని చెప్పారు. గణేష్ వాసుదేవ్ మావలంకర్ మొట్టమొదటి లోక్ సభకు స్పీకర్‌గా వ్యవహరించారని గుర్తు చేశారు. మొదటి తరం లోక్‌సభ సభ్యుల నుండి నేటి తరం రాజకీయ నాయకులు నేర్చుకోవా ల్సింది ఎంతో ఉందని అన్నారు. ఇదిలా ఉండగా మాక్ పార్లమెంట్‌కు బిఎ తృతీయ సంవత్సరం విద్యార్థి జి.ఉదయ కుమార్ స్పీకర్‌గా వ్యవహరించగా రైట్ టు రీకాల్ అంశంపై మాక్ పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్షాలు వాడీ వేడిగా చర్చిం చాయి. ఉదయం పలు తీర్మానాలను ప్రవేశపెట్టి సాయంత్రం ఆమోదించారు. ప్రధానిగా బిఎ మూడవ సంవత్సరం విద్యార్థి తెనాలి అపూర్వ, ఆర్థిక శాఖ మంత్రిగా ద్వితీయసంవత్సరం విద్యార్థి ఎల్.ధరణీశ్వరరెడ్డి హోం శాఖ మంత్రిగా సిహెచ్.గంగా సాత్విక్, ప్రతిపక్ష నేతగా చి.వెంకట నరేంద్ర వ్యవహరించారు. వీరంతా ఆయా పాత్రల్లో పరయాయ ప్రవేశం చేసి చర్చల్లో పాల్గొన్నారు. ఎన్నికైన సభ్యులు రెండున్నరేళ్ల తర్వాత తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 50 శాతమైనా నెరవేర్చకుంటే ఆ నియోజకవర్గ ప్రజలు 'రీకాల్' హక్కును పొందాలి అనే అంశంపై లోతుగా చర్చించి ఆమోదించారు. ఈ బిల్లు చట్టం రూపంలో అమలైతే దేశంలో ఆర్థికంగా, సామాజికంగా విప్లవాత్మక మార్పులొ స్తాయని స్పీకర్ వ్యాఖ్యానించారు. విద్యార్థులను వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధివర్మ, ప్రో.వైస్.చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, జిరిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎం.హెచ్.ఎస్. డీన్ డాక్టర్ కిషోర్‌బాబు, అధ్యాపకులు అభినంది ంచారు.



మాక్ పార్లమెంట్ హాలులో ఎంపీలుగా విద్యార్థులు



ప్రధానిగా వ్యవహరించిన విద్యార్థిని తెనాలి అపూర్వ

# సమస్యల పరిష్కారానికి పోరాటమే శరణ్యం

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ బ్యాంకుల పురోభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యాలు అవలంబిస్తున్న సాచివేత విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమ పంథా అవలంబించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆలిండియా బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పి. వీరారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో గుంటూరు డిస్ట్రిక్ట్ బ్యాంక్ రిటైరీష్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. వీరారెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ బ్యాంకుల విశ్రాంత ఉద్యోగులు సుమారు ఏడు లక్షల మంది ఉన్నారని, అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. రెండు దశాబ్దాలుగా పెన్షన్ అప్‌డేషన్, హెల్త్ ఇన్సూరెన్స్ స్కీముల్లో మెరుగుదల, జాతీయస్థాయిలో అన్ని యూనియన్లలో కలిసి సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని తదితర సమస్యల పైన డిమాండ్ చేస్తూ త్వరలో ఉద్యమ కార్యాచరణ చేయనున్నట్లు తెలియజేశారు. జిల్లా అధ్యక్షులు కె.హరిబాబు సభకు అధ్యక్షత వహించగా కార్యక్రమంలో కోఆర్డినేషన్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి కెవిబి మురళీకష్ణ, కార్యనిర్వహక కార్యదర్శి వై హనుమంతరావు, జాతీయ కమిటీ నాయకులు యర్ర కోటేశ్వరరావు, ఏ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వీరారెడ్డి



# కొండమోడు-పేరేచర్ల రహదారికి రూ.1032.52 కోట్లు మంజూరు

ప్రజాశక్తి - నరసరావుపేట : జాతీయ రహదారి (ఎన్‌హెచ్-167 ఏజీ) అభివృద్ధిలో భాగంగా కొండమోడు నుండి పేరేచర్ల వరకు 51 కిలోమీటర్ల మేర నాలుగు లైన్ల రహదారి నిర్మాణం కోసం రూ.1032.52 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరం నాటికి పనులు పూర్తి చేయాలని కేంద్రం భావిస్తోంది. భూసేకరణకు సంబంధించిన ఉత్తర్వులను పల్నాడు జిల్లా పరిపాలన విభాగం ఇప్పటికే జారీ చేసింది. ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తయ్యేలా కృషి చేస్తామని చెప్పారు.



పురస్కారాన్ని అందుకుంటున్న బెజగం రవికుమార్

# సత్తెనపల్లికి చెందిన ముగ్గురికి మహానంది జాతీయ ఉగాది పురస్కారాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి : పట్టణానికి చెందిన రంగస్థల నటుడు బెజగం రవికుమార్‌కు మహానంది జాతీయ ఉగాది పురస్కారం లభించింది. హైదరాబాద్ చిక్కడపల్లిలోని శ్రీత్యాగరాజ గానసభలోని కళా సుబ్బారావుకళావేదికలో ఆదివారం తెలుగు వెలుగు సాహితి వేదిక ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణా, కర్ణాటక నాలుగు రాష్ట్రాల స్థాయిలో కార్యక్రమం నిర్వహించారు. వివిధ రంగాల్లో 180 మందికి పురస్కారాలను ప్రదానం చేయగా పౌరాణిక రంగంలో బెజగం రవికుమార్, సత్తెనపల్లికే చెందిన సాహితివేత్త డాక్టర్ సరికొండ రమాదేవి సాహిత్య రంగంలో, తెలగతోటి కోటేశ్వరరావు విద్యా, పౌరాణిక రాంగాల్లో పురస్కారాలను అందుకున్నారు. వీరికి పట్టణ ప్రముఖులు, కళాకారులు శుభాకాంక్షలు తెలిపారు.